బీమా చెక్కు అందజేత

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మే 20 : కార్తకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఇటీవల కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సభ్యత్వం కలిగిన సురారపు వేణుమాధవ్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రూ. 2 లక్షల చెక్కును ప్రతాప్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. రైతు సమన్వయ సమితి మండల మాజీ కో-ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు మల్ల ఐలయ్య, నాయకులు అహ్మద్, సంపత్, పాల శంకర్‌గౌడ్, కొంతం రాజు తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌తోనే గొల్ల, కుర్మలకు సముచిత స్థానం

గజ్వేల్, మే 20 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గొల్ల, కుర్మలకు సుముచిత స్థానం దక్కిందని అందరికీ న్యాయం చేసేలా సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో బీరప్ప కామరాతి కల్యాణోత్సంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి పాల్గొని బీరప్పను దర్శించుకున్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఎంతో మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నరని ప్రభుత్వం వెంటనే ఆ పథకాన్ని అమలు చేయాలన్నారు. జడ్పీటీసీ మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందం, రమేశ్ గౌడ్, అహ్మద్, నిజాం, కుర్మ సంఘం నాయకులు బీరయ్య, బాలయ్య, అయ్యాలం, స్వామి, సంతోష్, రాములు, యాదగిరి, రాజయ్య, యాదయ్య, ఉన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మే 20 : సిద్దిపేట నుంచి సిరిసిల్లకు రైల్వే లైన్ భూసేకరణ కోసం జిల్లాలోని చిన్నకోడూర్, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రైల్వే ప్రాజెక్ట్ ముఖ్య అధికారులు, రెవెన్యూ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకోడూర్ మండలంలోని పెద్దకోడూర్, చిన్నకోడూర్, మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్, నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయా మండల తహసీల్దార్‌లకు తెలిపారు. ఆయా భూసేకరణను వేగంగా పూర్తి చేసి రైల్వే అధికారులకు అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో పి. సదానందం, రైల్వే అధికారులు మూర్తి, జనార్దన్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీని పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, మే 20 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3 వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 9,981 మంది విద్యార్థులు హాజరు కానున్నారని.. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,711, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,270 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్, అడీషనల్ డీసీపీ రాంచందర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తడిపొడి, చెత్తపై మహిళలకు అవగాహన

మహిళలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్

మద్దూరు(ధూళిమిట్ట), మే 20 : మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో తడిపొడి చెత్తపై పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ సోమవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాధవ్ జాదవ్ మాట్లాడుతూ మహిళలు తమ ఇండ్ల ముందుకు చెత్త బండి వచ్చిన సమయంలో తడిపొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించడం వల్ల డంపింగ్‌యార్డుల్లో వర్మి కంపోస్టు ఎరువును తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలోని మహిళలకు ఇప్పటికే తడిపొడి చెత్తను వేరు చేసేందుకు చెత్త బుట్టలను అందజేసినట్లు తెలిపారు.

కరాటే మెగా చాంపియన్‌షిప్ విజేతగా 'ప్రణవి'

గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో ప్రణవి

మద్దూరు(ధూళిమిట్ట),మే20 : ఈ నెల 19న గోవాలో జరిగిన యూనివర్సల్ 369 షోటోకాన్, కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కరాటే మెగా చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన బట్టర వెంకటేశ్ కూతురు బట్టర ప్రణవి ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. ఫైరింగ్ విభాగంలో గోల్డ్ మెడల్, కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. రెండు పతకాలను సాధించిన ప్రణవిని సినీనటుడు సుమన్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అతలాకుతలం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మే 20 : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అతలాకుతలవుతుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సదుపాయాల గురించి రైతులను అడిగితెలుసుకున్నారు. గతంలో ఎట్లా ఉండిగిప్పుడు ఎంట్లా ఉంది అని రైతులను ప్రతాప్ రెడ్డి అడుగగా కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రైతులకు మంచి రోజులు పోయాయని వాపోయారు. ధాన్యం లారీలోకి ఎక్కేవరకు భయంగా ఉందని ప్రతాప్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందని విమర్శించారు. సీఎం రేవంత్ చెబుతున్న మాటాలను అధికారులు పాటిస్తలేరా లేదా కావాలని నాటకం ఆడుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయలాన్నారు. తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనమని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రతి గింజా కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని హితవు పలికారు. లేకుంటే మిమ్ముల్ని అడుగడుగనా నిలదిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని నేడు 4 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అతలాకుతలవుతుందన్నారు. భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, నాయకులు సున్నం భాస్కర్, అంబటి బాలచందర్ గౌడ్, రవీందర్, బాలనర్సు, శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

తక్షణమే ఉపసంహరించుకోవాలి

మహాధర్నాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల డిమాండ్

మహాధర్నాలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం

సిద్దిపేట టౌన్, మే 20 : కాంగ్రెస్ సర్కారు భూముల విలువ పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిద్దిపేట రియల్ ఎస్టేట్ వ్యాపారు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూముల విలువ,రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్థానిక ముస్తాబాద్ చౌరస్తా వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ మొండి వైఖరిని వీడి భూముల విలువ పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రియల్ వ్యాపారం లేక పూర్తిగా రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రకటనతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుంటుబడి ఉపాధి కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆలోచించి 7.5 శాతంగా కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ చార్జీలను మూడు శాతానికి తగ్గించి భూములు విలువలను అలాగే కొనసాగించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో మల్లారెడ్డి, రంగయ్య, శ్రీనివాస్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శంకర్, రంగయ్య, మొయిజ్, మల్లారెడ్డి, చిన్నా, దేవేందర్, కృష్ణ, వెంకన్న, నర్సింహులు, మల్లేశం, యాదగిరి, బాలయ్య, శ్రీనివాస్, కనకయ్య, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టభద్రులు విద్యావంతుడికి మద్దతు ఇవ్వాలి

చేర్యాలలో గ్రాడ్యుయేట్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

చేర్యాల మండలంలోని నాగపురిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ తదితరులు

చేర్యాల, మే 20 : విద్యావంతుడు, వివాదరహితుడైన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నికలో మద్దతు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్ రావు ఆధ్వర్యం లో నాయకులు పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నాయకులు అవుశెర్ల వెంకట్, బాచీ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల గొంతుక బీఆర్ఎస్..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఎంపీపీ పుల్లంపల్లి కరుణాకర్ అన్నారు. పట్టభద్రుల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని నాగపురి, శభాష్‌గూడెంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎంపీపీ గ్రాడ్యుయేట్స్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బండమీది కరుణాకర్, బొడ్డు కిరణ్‌కుమార్, అధ్యక్షుడు భీమరాజు, కనకయ్య, సీనియర్ నాయకులు ఎల్లేశం, సత్యనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ కళాశాల విద్యార్థులు

తేనెటీగల పెంపకంపై అవగాహన ర్యాలీ

ములుగు, మే 20 : తేనెటీల పెంపకంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని అటవీ కళాశాల ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ శైలజ అన్నారు. సోమవారం 'ప్రపంచ తేనెటీగల పెంపకం' దినోత్సవాన్ని పురస్కరించుకొని 'బీ ఎంగేజ్డ్ విత్ యూత్' అనే అంశంపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ శైలజ మాట్లాడుతూ యువత స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడంలో తేనెటీగల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తేనెటీగల పెంపకంపై శిక్షణనందిస్తూ, ఉపాధి కల్పిస్తున్నామని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అటవీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వనాథుడి రథోత్సవం

దుబ్బాకలో కాశీవిశ్వనాథుడి రథోత్సవం

దుబ్బాక, మే 20 : దుబ్బాకలో కాశీ విశ్వనాథ దేవాలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వాటర్‌ప్లాంట్‌కు ఎన్నికలు నిర్వహించాలి

వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

హుస్నాబాద్‌టౌన్, మే 20: హుస్నాబాద్‌లోని బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌కు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు పలువురు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను సైతం నిర్వహించడం లేదని, లావాదేవీలు సైతంచూపడంలేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, అనంతస్వామి, వెల్దండి సతీశ్, గాదాసు రాంప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ విషయంపై స్థానిక వాటర్‌ప్లాంట్ల చైర్మన్ వరయోగుల శ్రీనివాస్ వివరణ కోరగా, ప్రధాన రహదారి మరమ్మతు పైపులైన్లు పగిలిపోవడం, మోటర్లు కాలిపోయి మంచినీటి సరఫరా నిలిచిపోయిందని, త్వరలోనే సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలవికాస సంస్థ ఆదేశాలు తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

హుస్నాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

హుస్నాబాద్, మే 20: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు వెల్దండి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీశ్, చందు, సంపత్‌నాయక్, మహేశ్వర్‌రెడ్డి, సమ్మయ్య, మహేష్కర్, రాంప్రసాద్, ప్రశాంత్, అనంతస్వామి, సంతోష్, వెంకటేశ్, సాయికృష్ణ, నరేశ్, రవీందర్, బాలరాజు, శ్రీనివాస్, అరుణ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సర్వేను అడ్డుకున్న భూనిర్వాసితులు

గజ్వేల్, మే 20 : గజ్వేల్ పట్టణ సమీపంలోని సంగాపూర్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో తాత్కలికంగా మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు కేటాయించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లలో ప్రస్తుతం ఎవరెవరూ నివాసం ఉంటున్నారో తెలుసుకునేందుకు సోమవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. అందులో నివాసం ఉంటున్న మల్లన్నసాగర్ నిర్వాసితులు తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ప్యాకేజీలు వచ్చాకే సర్వే చేయాలని అప్పటి వరకు తమ ఇండ్ల వద్దకు అధికారులు రావొద్దంటు రెవెన్యూ అధికారులను అడుకొని నిలదీశారు. ప్రస్తుతం అందులో ఎంత మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారో తెసుకొని ఆర్డీవో బన్సీలాల్‌కు నివేదికను అధికారులు అందజేశారు.

డబుల్ బెడ్‌రూంల వద్ద అధికారులను అడ్డుకుంటున్న భూనిర్వాసితులు

మిరుదొడ్డిలో 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం'

మిరుదొడ్డిలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిరుదొడ్డి, మే 20 : మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లో ఆదివారం 2003-2004 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, ర్యాకం మల్లేశం, రమేశ్, సంతోశ్ కుమార్, శేఖర్, ఆనంద్, వెంకటేశ్, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్

వైద్యులకు సూచనలు చేస్తున్న జిల్లా వైద్యా,ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్

చేర్యాల, మే 20 : ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని, 24 గంటలు వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్ సూచించారు. చేర్యాల పట్టణంలోని సీహెచ్‌సీ, పీపీ యూనిట్‌లను సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కుక్క, పాము కాటుకు అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వినోద్‌బాబ్జీ, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవంతి, డాక్టర్లు తిరుపతి, మున్నిసా, లతా, శ్రీనివాస్, సీహెచ్‌వో సుధీర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నారాయణరావుపేట, మే 20 : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని నారాయణరావుపేట, బంజీరుపల్లి కోదండరావుపల్లి పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు ఎల్లయ్య ఉన్నారు.

సరిపడా జీలుగ విత్తనాలు అందించాలి

మద్దూరు (ధూళిమిట్ట), మే 20 : మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో జీలుగ విత్తనాల కొరత ఏర్పడింది. భూసారం పెంపునకు జీలుగ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రచారం చేస్తున్నప్పటికీ దానికి అనుగుణంగా జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో విఫలమైంది. ప్రభుత్వం సరిపడా జీలుగ విత్తనాలు అందించాలని మద్దూరు, ధూళిమిట్ట మండలాలలోని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

బెజ్జంకి, మే 20 : మండల కేంద్రంలోని అగ్రోస్ దుకాణంలో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నవని, రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండలవ్యవసాయ శాఖ అధికారి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తనలు పొందే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాఫీలను అందించి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

పింకీ (ఫైల్)

కొండపాక (కుకునూరుపల్లి), మే 20 : మధ్యప్రదేశ్‌కు చెందిన వివాహిత అదృశ్యమైంది. తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన బులియా సలాం-పింకీ దంపతులు. ఆరు నెలలుగా మెదినీపూర్ శివారులోని కామాక్షి సిమెంట్ ఇటుక కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 15న కంపెనీకి సంబంధించిన రూమ్‌లో నిద్రించారు. ఉదయం లేచేసరికి భార్య పింకీ కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పింకీ భర్త బులియా సలాం కుకునూరుపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుబ్బాక, మే 20 : మండల పరిధి హబ్షీపూర్‌లోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎల్కట్రిసిటీ ఏడీఈ రాంబాబు తెలిపారు. మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చేపల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

మద్దూరు (ధూళిమిట్ట), మే 20 : మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు చేపల చోరీకి పాల్పడడంతో సోమవారం ముదిరాజ్ సంఘం పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తమకు నష్టం చేకూర్చే విధంగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో అక్రమంగా చెరువులోకి ప్రవేశించి కొన్ని రోజులుగా చేపల వేట సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలను అక్రమంగా పట్టుకొని తమకు నష్టం చేస్తున్న వ్యక్తులను పట్టుకొని తమకు న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

టైలర్ మృతిపై ప్రముఖుల సంతాపం

చేర్యాల, మే 20 : చేర్యాల పట్టణానికి చెందిన ప్రముఖ టైలర్ గొరంతల ఆంజనేయులు(68)ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. 50 ఏండ్లుగా టైలర్ వృత్తిలో రాణిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. ఆంజనేయులు మృతిపట్ల సోమవారం కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తారయాదగిరి, పచ్చిమడ్ల సతీశ్, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ముస్త్యాల బాలనర్సయ్య, బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు శివగారి అంజయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఈరి భూమయ్య, వివిధ పార్టీల నాయకులు, పట్టణ వ్యాపారవేత్తలు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి, మే 20 : మండల కేంద్రంలోని తహసీల్‌లో సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సంగెం మధు కోరారు. అధికారులు, సిబ్బంది 10:50 గంటలు దాటినా ఉద్యోగానికి రావడం లేదని, పలు సమస్యలు, సర్టిఫికెట్లకు కోసం వచ్చే ప్రజలు అధికారులు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సమయపాలన పాటించకుంటే ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.